అతను ఎలాంటివాడో గ్రహించ గలుగుతాం. ఎవరైనా మనల్ని కొట్టారనుకోండి. అప్పుడు చక్కెర నీరు అనే ఓర్పు బయటికి వచ్చి శాంతంగా ఉంటాడా? లేక ఉప్పు నీరు అనే కోపం, ప్రతీకారం బయటికి వచ్చి ఆ ప్రకారం ప్రవర్తిస్తాడా అన్నదాని మీద అతనెలాంటి వాడన్నది ఆధారపడి ఉంటుంది. తన కుటుంబ సభ్యులని ప్రేమించినట్లే, ప్రపంచంలోని అందరినీ కూడా తన ఆత్మీయుల్లా ప్రేమించ గలిగేవాడే మంచి మనిషి. ఎందుకంటే ప్రేమ మనం ఎలాంటి తప్పులు చేయకుండా అడ్డు పడటమే కాకుండా, ఎన్నో పాపాల నించి మనల్ని దూరంగా ఉంచుతుంది. ఓ మనిషి ఉత్తముడు అవడానికి అతను ప్రపంచంలోని అందరినీ సమానంగా ప్రేమించ గలుగుతున్నాడా లేదా అన్న ఒక్క విషయాన్ని బట్టి తెలుసుకోవచ్చు. ఇప్పుడర్థమైందా?"

"అయింది స్వామీ! తన, మన, ఇతర అనే భేదాలు లేనివాడే నిజమైన సత్పురుషుడు." చెప్పారా గ్రామస్తులు.

## 7. ఏడు వస్తువులు

ఓ గురుకులంలో సాధన చేస్తున్న శిష్యులు తమ గురువు జన్మదినాన్ని అట్టహాసంగా జరిపారు. బీదసాదలకి విశేషంగా అన్నదానం చేసారు. శిష్యులు ఆ సాయంత్రం, గురువు గారిని నాలుగు మంచి మాటలు చెప్పమని కోరారు.

అయన వాత్సల్యంగా చూసి అందరికీ తలో కవరు ఇచ్చి చెప్పాడు.

"వీటిలోని వస్తువులని మీరు రోజుకోసారైనా తీసి చూడండి. వాటి అర్థం తెలుసుకుంటే, మీరు వక్రమార్గంలోకి వెళ్ళకుండా అవి ఉపయోగపడతాయి"

శిష్యులు కవర్లలోని వస్తువులని చూసారు. అవన్నీ నిత్యజీవితంలో మనుషులంతా ఉపయోగించేవే. అంతా ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు. ఆ వస్తువులనించి ఏం నేర్చుకోవాలో వాళ్ళకి అర్థం కాలేదు.

అదే సంగతిని ఓ శిష్యుడు మర్నాడు గురువుని అడిగాడు.

ఆయన తన దగ్గరున్న అలాంటి ఓ సంచీలోంచి, ఒకో వస్తువు తీసి వాళ్ళకి చూపిస్తూ చెప్పసాగాడు.

మొదటగా ఓ టూత్‌పిక్‌ని చూపించి చెప్పాడు.

"మనసులోని మాలిన్యాన్ని, మనిషిలోని చెడు గుణాలని నిత్యం తీసివేయాలని ఇది గుర్తు చేస్తుంది."

తర్వాత ఓ రబ్బర్ బేండ్‌ని తీసి చెప్పాడు.

"మనకి ఎంతటి సమస్య వచ్చినా దానికి అనుగుణంగా సాగాలి కాని, లొంగిపోయి తెగిపోకూడదని ఇది గుర్తు చేస్తుంది."

ఆ తర్వాత ఓ బేండ్ ఎయిడ్ చూపించాడు.

"ఇతరుల మనసులు మన మాటల వల్ల, చర్యల వల్ల గాయపడకుండా మనం అనుక్షణం జాగ్రత్తగా ప్రవర్తించాలని ఇది గుర్తు చేస్తుంది. అలాగే ఇతరులవల్ల మన మనసులకి కలిగే గాయాలని వెంటనే మాన్పుకోవాలి తప్ప, వాటితో బాధ పడకూడదని, వారిమీద ద్వేషం పెంచుకోకూడదని కూడా ఇది గుర్తు చేస్తుంది."

ఓ రబ్బర్‌ని చూపించి చెప్పాడు.

"మనం చేసిన తప్పులని సరిదిద్దుకోవాలని ఇది గుర్తు చేస్తుంది. అంతేకాదు, మనలాగే ఇతరులు కూడా తప్పులు చేస్తారని, అందుకు వారిని విమర్శించ కూడదని కూడా గుర్తు చేస్తుంది."

తర్వాత ఓ పెన్సిల్ చూపించాడు.

"నిత్యం లిఖిత నామజపం విడువకూడదని, ఇంకా మనకు దేవుడిచ్చిన అనేక వరాలను మరచిపోకుండా రాసుకోవడానికి ఇది ఉపయోగిస్తుంది."

తర్వాత ఓ జెమ్ క్లిప్‌ని చూపించాడు.

"ఇది కాగితాలు చెల్లాచెదురు కాకుండా కలిపి వుంచుతుంది. అలాగే మనుషులంతా సమైక్యంగా జీవించాలని దీని అర్థం."

చివరగా ఓ టీ బేగ్‌ని తీసి చూపించాడు.

"ఇది అన్నిటికన్నా ముఖ్యమైంది. తనకంటూ ఏం దాచుకోకుండా ఈ టీ బేగ్ ఉన్నదంతా తను మునిగే వేడి నీటికి ఇస్తుంది. అలాగే మనల్ని కష్టాల్లోకి నెట్టేవారిని కూడా క్షమించి, మనకంటూ ఏం మిగుల్చుకోకుండా ఉన్నదంతా వారికి పంచాలి. అప్పుడే సాధన ఫలించి ముక్తి పొందుతాం" గురువు వివరణతో శిష్యులు ఎంతో నేర్చుకున్నారు.

## 8. సమాధానం

ఓ వ్యక్తి బాగా నాస్తికుడు. అతను ఓసారి ఒక సద్గురువు దగ్గరకు ఓ మిత్రుడితో వెళ్ళాడు. ఆయన దేవుణ్ణి భజించడం వల్ల కలిగే అనేక ప్రయోజనాల గురించి చెప్పాడు.

"ఎవరికైనా, ఏమైనా అనుమానాలున్నాయా?" ప్రశ్నించాడాయన.

"మీరు చెప్పిందంతా బావుంది. కానీ అసలు దేవుడు ఎవరో, ఎక్కడుంటాడో, ఎలా వుంటాడో వివరంగా చెప్పగలిగితే అప్పుడు మీరు చెప్పింది నేను నమ్ముతాను." చెప్పాడా నాస్తికుడు.

"దేవుణ్ణి గురించి నువ్వు అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్తాను. అందుకు ముందుగా నువ్వు ఓ పని చేయాలి."

ఏం చేయాలో వివరించాడు సద్గురువు.

నాస్తికుడు అందుకు ఒప్పుకుని ఇంటికి వెళ్ళాడు. తన ఇంటి డాబా మీద ఇరవై కిలోల మట్టిని పోశాడు. అందులో ఆనపకాయ గింజని పాతి నీళ్ళు పోసి పెంచసాగాడు.

కొన్నాళ్ళకు అనపగింజ మొలకెత్తి, పెరిగి డాబా అంతటా పాకింది.